ప్రజాశక్తి
ఆదివారం 22 జనవరి 2023 | 5
పార్వతీపురం మన్యం



రోడ్డును కప్పేసిన పొగమంచు

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో వారం రోజులుగా విపరీతంగా పొగ మంచు కురుస్తోంది. ఉదయం 4 నుంచి 8 గంటల వరకు దీని ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ఉదయం ప్రయాణించే వాహన చోదకులు రోడ్డు కనిపించకపోవడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పెసర, మినిము పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే జీడి, మామిడి పూత దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మినుము, పెసర కాయలు పక్వానికి వచ్చి గింజ కట్టకుండా ఉంటుందని రైతులు వాపోతున్నారు. సాలూరు నుండి కురుకూటి వెళ్లే వరకు రోడ్డుపై విపరీతమైన మంచు ఉండడంతో వాహనదారుల బాధలు వర్ణనాతీతం.

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల ఆరాధ్య దైవం శంబర పోలమాంబ అమ్మవారి జాతర ముందే వచ్చిందన్న రీతిగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత రెండేళ్లు కరోనా మహమ్మారి భయంతో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఈ ఏడాది భక్తులకు అన్ని విధాలా అనుకూలంగా ఉండడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగానే దేవాదాయ శాఖ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తరువాత మొట్టమొదటి గిరిజన జాతర కావడంతో జిల్లా ఉన్నతాధికారులంతా జాతర విజయవంతమయ్యేలా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తూ పర్యవేక్షిస్తున్నారు.

ఆలయం వద్ద క్యూలైన్లు

700 మందితో బందోబస్తు

జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ 700 మందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. అలాగే క్యూలైన్లు, గ్రామంలో రద్దీ ప్రాంతాలు కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. అలాగే సిరిమాను తిరిగే ప్రాంతమంతా డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

సంబరానికి వేళాయే

శంబర జాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు ● ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

శంబర పోలమాంబ విగ్రహం

ఈనెల 23, 24, 25 తేదీల్లో పోలమాంబ అమ్మవారి జాతర జరగనుంది. దేవాదాయ శాఖ ఇఒ రాధాకృష్ణ, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పి.దాలి నాయుడు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకానున్న తరుణంలో పటిష్టంగా క్యూలైన్ల ఏర్పాటు చేశారు. 10, 50 రూపాయల క్యూలైన్లతో పాటు ఉచిత దర్శనం కూడా ఏర్పాటు చేశారు.

నిరంతర వైద్య సేవలు

జాతర జరుగనున్న మూడు రోజులు పాటు నిరంతర వైద్య సేవలు అందించేందుకు వైద్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఐదు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డిఎంహెచ్ఒ జగన్నాధరావు తెలిపారు. పిహెచ్‌సిల నుంచి 9మంది వైద్యులు, సిబ్బంది, రెండు 108 వాహనాలను, ఐదు ఫీడర్ అంబు లెన్సులు, ఒక 104 వాహనం అందు బాటులో ఉంటా యని తెలిపారు.

గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేక దర్శనాలు

చదురుగుడి, వనంగుడి ఆలయాల వద్ద గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు ఏర్పాటు చేశారు. భక్తులకు సేవలందించేందుకు వివిధ ఆలయాల నుంచి డిప్యుటేషన్‌పై 95 మందిని దేవాదాయశాఖ అధికారులు నియమించారు.

ఈ ఏడాది కొత్త నిర్ణయాలు

శంబరలో పెద్ద పోలమాంబ జాతర అనంతరం ఏర్పడిన స్వల్ప అల్లర్లను దృష్టిలో పెట్టుకుని పార్వతీపురం డిఎస్పీ సుభాష్ ఆధ్వర్యంలోని పోలీస్ శాఖ కఠినంగా నిర్ణయాలు చేపట్టింది. గ్రామంలోని కొందరి ఫిర్యాదుతో వైసిపిలోని రెండు వర్గాలపైనా, టిడిపికి చెందిన 50 మందిని బైండోవర్ నమోదు చేశారు. సినిమాను తిప్పేందుకు వచ్చే వ్యక్తులు ఇటువంటి కేసుల్లో ఉండకూడదని, అలాగే మద్యం సేవించకూడదన్న నిబంధన ఇప్పటికే జారీ చేశారు. ఇటీవల జరిగిన సమీక్షల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని జాతర సందర్భంగా చేపడతామని డిఎస్‌పి తెలిపారు. ఇదిలా ఉండగా సినిమాను తిప్పేందుకు ఈ ఏడాది వేలంపాట నిర్వహించారు. ఈ పాటలో అర్హత పొందిన వ్యక్తికే సినిమాను తిప్పే మొత్తం బాధ్యతను అప్పగించారు. బైండోవర్ కేసులు పెట్టడం, సినిమాను తిప్పేందుకు వేలంపాట నిర్వహించడంపై పలువురు ఆక్షేపిస్తున్నారు. మరి కొంతమంది బైండోవర్ కేసులు వల్ల జాతర సాఫీగా జరిగేందుకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

నిరంతర విద్యుత్తు సరఫరా

జాతర సందర్భంగా విద్యుత్ శాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. విద్యుత్ శాఖ జెఇ దగ్గరుండి పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే శంబరలో సిరిమాను తిరిగేందుకు ఎటువంటి ఆటంకం లేకుండా ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేశారు

అందరి సహకారంతో ముందుకు..

- ఇఒ రాధాకృష్ణ

శంబర పోలమాంబ అమ్మవారి జాతర సక్రమంగా నిర్వహించ డంలో అందరి సహాయ సహకారాలు తీసు కుంటున్నాం. ఉన్నతా ధికారులతో పాటు ట్రస్ట్ బోర్డు గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో భక్తులకు ఆటంకం లేకుండా అన్ని సౌకర్యాలు చేపడుతున్నాం. గతంలో పలు జాతరలు చేసే అనుభవం ఉన్న దేవాదాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలతో నిర్వహణ చేస్తున్నాం.

కొత్తగా నిర్మించిన రహదారి

రహదారి పాట్లు తప్పినట్టే

శంబరలో పోలమాంబను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు గతంలో కంటే ఈసారి రహదారితో ఇబ్బందులు తొలగినట్లే. శంబర- మామిడిపల్లి, మక్కువ వయా కవిరిపల్లి మీదుగా శంబర వెళ్లే రహదారులను కొత్తగా నిర్మించారు. సిరిమాను తిరిగేందుకు శంబరలో ఆర్ అండ్‌బి అధికారులు కొంతమేరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. గోముఖీ నదిపై పైపులైన్ కాజ్‌వే నిర్మించి చెముడు మీదుగా వచ్చే ఇబ్బందులను తొలగించారు. గోముకి వంతెనకు ఇరువైపున రక్షణ కవచాలు ఏర్పాటు చేశారు.

పొరపాట్లు జరగనీయం

- ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు

జాతర సందర్భంగా ఏ చిన్న పొరపాటు కూడా జరగకుండా ట్రస్ట్ బోర్డుగా బాధ్యతలు నిర్వహిస్తాం. ఉన్నతాధికారులందరికీ బోర్డు సభ్యుల సహాయ సహకారాలు అన్ని వేళలా అందిస్తాం. గతంలో జరిగిన పొరపాట్లు జరగకూడదనే సిరిమాను తిప్పేందుకు వేలం నిర్వహించాం. బైండోవర్ చేయడం వల్ల జాతర సందర్భంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఎటువంటి అల్లర్లకు తావు ఉండదు.

శాశ్వత ఏర్పాట్లు చేయాలి

- టి.పోలి నాయుడు, ఎంపిటిసి

జాతర సందర్భంగా చేస్తున్న కొన్ని ఏర్పాట్లు తాత్కాలికం కావడం వల్ల దేవాదాయశాఖకు వచ్చే ఆదాయం మిగులు లేకుండా పోతుంది. వేలాది రూపాయలు పెట్టి క్యూ లైన్లను దశలవారీగా శాశ్వతంగా ఏర్పాటు చేయాలి. ఎన్నికల మాదిరిగానే జాతరలో బైండోవర్ కేసులు పెట్టడం అన్యాయం. గతంలో ఏ విధమైన అల్లర్లూ లేకపోయినా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దారుణం. సిరిమాను తిప్పేందుకు వేలం వేసే నిర్ణయం హేయమైనది. ఇది అమ్మవారి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది.

ఇళ్ల ఇర్మాణాల గురించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న కలెక్టర్‌నిశాంత్‌కుమార్

లక్ష్యం చేరకుంటే వేటు

గృహ నిర్మాణాల సమీక్షలో కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో పేదల గృహ నిర్మాణానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోతే వేటు తప్పదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పట్టణ, మండల గృహ నిర్మాణంపై ఆయన మున్సిపల్, హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. తొలుత పట్టణానికి చెందిన సచివాలయాల వారీగా సమీక్షించారు. ఒక్కో సచివాలయం పరిధిలో గృహ నిర్మాణం ప్రగతికి సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. పట్టణానికి చెందిన జగనన్న లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణం మందకొడిగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పనితీరు కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాలూరులో వెనుకబాటుతనం జిల్లా ప్రగతిపై ప్రభావం చూపిస్తోందని చెప్పారు. జిల్లాలో గృహ నిర్మాణ పనులు 65శాతం ఉంటే సాలూరు అర్బన్‌లో కేవలం ఐదు శాతం ఉందన్నారు. గృహ నిర్మాణంలో పురోగతి కనిపించకపోతే జీతాలు నిలిపివేస్తామన్నారు. తదుపరి సమీక్ష సమావేశం నాటికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయకపోతే క్షమించేది లేదన్నారు. గుమడాం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టమని పట్టాలిచ్చేసిన వారి స్థానంలో కొత్త వారికి కేటాయింపు చేయాలన్నారు. కొంతమంది లబ్ధిదా రులు యూనిట్ విలువ తక్కువగా ఉందనే అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారని ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళగా యూనిట్ విలువ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. లబ్ధిదారులకు బ్యాంక్ లింకేజ్ రుణాలు ఇప్పించడం లో పురోగతి లేదని మెప్మా సిఎంఎం, సిఆర్పీలపై ఆగ్రహించారు. వచ్చే సమీక్ష సమావేశం నాటికి పనితీరులో మార్పు కనిపించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్ శంకరరావు, హౌసింగ్ డిఇ సోమేశ్వరరావు, ఎంపిడిఒ జి.పార్వతి పాల్గొన్నారు.

బలిజిపేట: మండలం గృహనిర్మాణా లను సకాలంలో పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు అదేశించారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎమ్మెల్యే అధ్యక్షతన మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. మండలంలో 3,006 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 1061 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోగా మిగతావిం వివిధ దశల్లో ఉన్నాయని, వీటిని సత్వరం పూర్తి చేసేలా లబ్ధిదారులతో మాట్లాడి సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య అధికారులతో కలిసి గ్రామాల వారీగా చేపట్టిన ఇంటి ఇంటి కుళాయి పనులు ప్రగతిపై సమీక్షించారు. సమీక్షలో ఎంపిపి గుడివాడ నాగమణి, జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, వైస్ ఎంపిపిలు బెవరా హేమలత, వెలిది సాయిరాం, ఎంపిడిఒ భాను మూర్తి, తహశీల్దార్ వివిఎస్ఎస్ శర్మ, హౌసింగ్ డిఇ రవిప్రసాద్ బాబు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ హనుమంతరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపిటిసి సభ్యులు, ఆయా శాఖల ఎఇలు, జెఇలు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

నూతన వంగడాలు ప్రవేశ పెట్టాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పసుపు, ఫైనాఫిల్ పంటల్లో మార్కెట్ డిమాండు గల అధిక నాణ్యత, దిగుబడులిచ్చే రకాల సాగును ప్రోత్సహించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో ఐటిడిఎ ప్రోజెక్టు అధికారులు, వ్యవసాయ, ఉద్యానవనశాఖ, డిఆర్‌డిఎ అధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజనులు పండించే పంటలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం కోసం ప్రణాళికను తయారు చేయాలన్నారు. గత సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు అందజేసిన నివేదికను పరిశీలించారు. రైతుల పంటలకు అధిక ధరలు పొందేందుకు మార్కెట్‌లో డిమాండు గల రకాలను సాగు చేయించాలన్నారు. నివేదికలో జీడి ఉపఉత్పత్తుల తయారీ, జీడి ప్రాసెసింగు యూనిట్లు అద్దె ప్రాతిపదికన ఏర్పాటు, జిల్లాలో గల అన్నిరకాల గోడౌన్ల సమగ్ర సమాచారం తదితర అంశాలను పొందుపర్చి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమావేశంలో సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్య, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, ఉద్యాన అధికారి కె.వి.ఎస్.ఎన్. రెడ్డి, ఎపిడిలు పాల్గొన్నారు.

కొంప ముంచిన 'గొంప'

మాజీ ఎమ్మెల్యే లలితకుమారికి షాక్
ఎస్.కోట టిడిపి అభ్యర్థిగా కృష్ణకే అవకాశాలు

ప్రజాశక్తి - జామి, వేపాడ

గొంప కృష్ణ

'అంతా అనుకున్నట్లే అయ్యింది...కోళ్ల కుటుంబానికి ఎదురుదెబ్బ తగులుతున్నట్టు జరుగుతున్న ప్రచారానికి బలం చేకూరుతోంది. ఎస్.కోట నియోజకవర్గంలో టిడిపిలో ఎదురు లేని నాయకులుగా చక్రం తిప్పే కోళ్ల కుటుంబానికి కోలుకోలేని షాక్ తగలే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందరూ ఊహించినట్లే ఎన్ఆర్ఐ గొంపకృష్ణ టిడిపి ప్రవేశంతో కోళ్ల కుటుంబానికి ఎదురు దెబ్బ తగిలినట్లయ్యింది. తాజాగా శనివారం విశాఖలోని రామనగర్ టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర నాయకులు బుద్దా వెంకన్న, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్, నాయకులు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ సమక్షంలో ఎస్.కోట నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల టిడిపి అధ్యక్షులు, ప్రధానకార్యదర్శులతో పాటు మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఆమె భర్త రాంప్రసాద్ కూడా పాల్గొన్నారు. వీరందరి అభిప్రాయాలను నాయకులు సేకరించినట్లు తెలిసింది. అనంతరం టిడిపి అభ్యర్థిగా గొంప కృష్ణ పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలిసింది. దీంతో లలిత కుమారి కన్నీరుపెట్టుకొని వెనుదిరిగారని పలువురు నాయకులు తెలిపారు. అయితే కోళ్ల లలితకుమారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని నాయకులు చెప్పడంతో ఆమె ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టు కుంటారా...? లేక ఏం చేస్తారన్నదానిపై తెలుగు తమ్ముళ్లలో ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ హఠాత్ పరిణామం వెనుక అనేక కారణాలు ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందే ఇటువంటి ప్రకటన చేయడం, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో తీవ్ర చర్చకు తెర లేపినట్లు అయ్యింది.

రోడ్డు పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ

శరవేగంగా రోడ్ల పనులు

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని గిరిశిఖర గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను శనివారం పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్, జనవరి వరకు రోడ్ల పనులపై దృష్టి సారించడంతో ఆ పనులు చివరి దశకు చేరుకొని మార్చి నాటికి గిరిజనులకు పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యాలు అందుబాటు లోకి వస్తాయన్నారు. నీలమ్మవలస నుంచి గుమ్మడిగూడ వరకు రూ.3 కోట్ల 76 లక్షలతో 6.8 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం పనులు, ఆజూరి నుంచి పందిరి మామిడివలస వరకు రూ.2.24 కోట్లతో 3.8 కిలోమీటర్లు, వేటగాని వలస నుంచి శతాభి వరకు రూ.10 కోట్లతో 14.5 కిలోమీటర్లు తారు రోడ్డు పనులు మార్చి నాటికి పూర్తికానుందని అన్నారు. దీనివల్ల అరుకు వెళ్లే రోడ్డుకు అనుసంధానంగా ఉంటూ మన్యం ప్రజలకు అరుకు వెళ్లేందుకు దగ్గరవుతుందన్నారు. కుంటాం, తుమ్మిగుడ్డి బ్రిడ్జి పనులు రెండు కోట్లతో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఆర్ఒ హేమలత

25న జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఆర్ఒ కె.హేమలత తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణ ఏర్పాట్లపై ఆర్‌డిఒ కార్యాలయంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటలకు ఆర్‌సిఎం (జిల్లా కార్యాలయాల సమూహం) కాంప్లెక్స్‌లో కార్యక్రమం జరగనుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆమె తెలిపారు. ఓటర్ల దినోత్సవంను వేడుకగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కళాశాల విద్యార్థుల బృందాలకు ఓటరు దినోత్సం భావనపై రంగోలి పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రంగోలిలో పాల్గొనే విద్యార్థి బృందాలు ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఓటింగ్‌లో ఇవిఎం పాత్ర, పోలింగ్ బూత్ తదితర ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన అంశాలపై ముగ్గులు వేయాలని ఆమె సూచించారు. వేదిక వద్ద సెల్ఫి పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఓటరు ప్రతిజ్ఞ, ఉత్తమ బూత్ స్థాయి అధికారులకు ప్రశంసా పత్రాలు పంపిణీ, యువ ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ, సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో డిపిఆర్ఒ ఎల్.రమేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.రాజు, తహశీల్దార్ శివన్నారాయణ, ఇతర సహాయ ఓటరు నమోదు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బరువెక్కిన గుండెలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



పెద్ద పండగెళ్లిపోయింది. దాంతోపాటే పిండివంటలు.. నాటుకోళ్ల ఆరగింపు, బావమరుదల ఎకసెక్కాలు, ఎటకారాలు, తల్లీపిల్లల ఆప్యాయత, అల్లుళ్ల మర్యాదలు.. మమకారపు మాధుర్యాలు, స్నేహితుల మధ్య అనురాగపు పలకరింపులు గడిచిపోయాయి. పుట్టిపెరిగిన ఊళ్లను, కనిపెంచిన తల్లిదండ్రులను, చిన్ననాటి తీపి గుర్తులను వదిలి పొట్టకూటి కోసం పిల్లాపాపలతో మూటముడి కట్టుకుని, ముసలి తల్లిదండ్రులను వదిలిపెట్టి వలసపోతుంటే గుండెలు బరువెక్కుతున్నాయి. ఇదీ ఇటు వలస కార్మికులు, అటు వారి తల్లిదండ్రుల ఆవేదన. పేగు బంధాలు, రక్త సంబంధీకులు, ప్రాణ స్నేహితుల కంటతడి వేదన వర్ణణాతీతం. ఈ గుండె కోతకు, కంటతడికి ముమ్మాటికీ పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వం వివక్షే కారణమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రపంచమే ఒక కుగ్రామంగా మారుతున్న నేటి తరుణంలో ఉద్యోగ, ఉపాధి కూడా సుదూర ప్రాంతాలు వెళ్లడం పెద్ద విషయమేమీ కాకపోవచ్చు. కానీ, అక్కడికి వెళ్లినా అత్తెసరుగానే బతికితే, అంతదూరం ఎందుకు వెళ్లాలన్నది ప్రశ్న. ఔను... మన ప్రాంతం నుంచి వలస వెళ్లే కార్మికులకు ఎనేక రంగాల్లో ఎంతో నైపుణ్యం ఉంది. కానీ, అత్తెసరు వేతనాలకు కండలు పిండి చేసుకోవాల్సి వస్తోంది. కనిపెంచిన తల్లిదండ్రులను చూసేందుకు ఏటా ఒకటో రెండో సార్లు వచ్చి, వెంటనే వెళ్లిపోవాలంటే ఎవరికి మాత్రం బాధగా ఉండదు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అచ్చంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ రెండు జిల్లాల్లో సారవంతమైన భూములు, అపారమైన ఖనిజ సంపద, విస్తారమైన అటవీ ప్రాంతం, అబ్బురపర్చే సముద్రతీరం ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఈ రెండు జిల్లాలో అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా 80శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడినప్పటికీ పంటల సాగు, ఉత్పత్తిలో అదమ స్థానంలో నిలిచింది. ఇక పారిశ్రామిక రంగంలో అట్టడుగు స్థానం. సేవారంగమూ అంతంతమాత్రమే. దీనికితోడు జిల్లాలో పూర్వం నుంచీ ఉన్న జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ప్రభుత్వ విధానాల వల్ల మూతపడ్డాయి. మాంగనీస్, అటవీ, మత్స్య సంపద ఎంతో ఖ్యాతి గడించినప్పటికీ వాటిని స్థానికంగా ఉపయోగించి ఉపాధి అవకాశాలు మెగురుపర్చడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. ఇక వ్యవసాయ రంగాభివృద్ధికి తలపెట్టిన తోటపల్లి, రామతీర్థసాగర్, జంఝావతి వంటి ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు తగిన నిధులు కేటాయించక పోవడంతో సాగునీరందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. దీంతో, ఏటా సాగుభూమి తగ్గిపోతోంది. భవన నిర్మాణం, వ్యవసాయం, హోటల్, ఆటో మొబైల్ రంగం తదితర అనేక చిన్న చిన్న పనులు చేసుకోవడానికి చెన్నై, బెంగుళూరు, తిరుపతి, విజయవాడ, విశాఖ, కోల్‌కత్తా, కటక్ వంటి సూదూర ప్రాంతాలకు మన జిల్లాల నుంచి వేలాది మంది వలస పోవాల్సి వస్తోంది. భార్యా పిల్లల్ని ఊళ్లలోనే విడిచిపెట్టి కొందరు, వృద్ధాప్యంలోవున్న తల్లిదండ్రుల్ని వదిలి వెళు తున్నవారు మరికొంతమంది. బస్సులు, రైళ్ల ఖాళీలు లేకపోయినా, రిజర్వేషన్లు అవ్వకపోయినా గంపెడు ఆనందంతో సంక్రాంతి పండక్కి వచ్చిన వలస కార్మికులంతా పండగ ముగిసిన రెండు రోజులకే పుట్టెడు దుఖంతో వెనుదిరిగారు. అలాగని ఊళ్లోనే ఉండిపోదామంటే స్థానికంగా ఉపాధి దొరకని పరిస్థితి ఉందంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగితే తప్ప వలసల నివారణ సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఎప్పటికైనా వలసలను నివారించి ఉపాధి కల్పించే పాలకులు వస్తారా? అన్న ఆశతో వలస కార్మికులు ఎదురు చూస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న సిఐ, ప్రిన్సిపల్, సిబ్బంది

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల బాలికలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు భద్రగిరి ఎపి గిరిజన గురుకుల (పీటీజీ) బాలికల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినిలు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా వాలీబాల్ కోచ్, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి. వైకుంఠరావు విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 23 నుంచి 25 వరకు కర్నూలులో నిర్వహించనున్న ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు భద్రగిరి గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన అండర్- 17 కేటగిరి విభాగంలో 4 గురు బాలికలు ఎంపిక అయ్యారని తెలిపారు. వీరు గత నెల పార్వతీపురంలో నిర్వహించిన వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పాఠశాలలో చదువుతున్న సుమారు వంద మంది బాలికలు పాల్గొన్న ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఉమ్మడి జిల్లా విజయనగరం తరుపున రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొబోతున్నారన్నారు. ఎంపికైన విద్యార్థినిలు ఎమ్. కీర్తి (9వ తరతగతి), ఎ.సలోమి (10), బి.వైశాలి (10), ఎం.ప్రభావతి (9) ఉన్నారన్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ఎల్విన్‌పేట సిపి పి.సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.కమల కుమారి, ఎస్ఐ షణ్ముఖరావు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ తిరుపతిరావు, పాఠశాల పిడి మౌళి, అరుణకుమారి, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

పాలకొండ : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అన్నిరకాల ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ కై వినియోగించే ప్లాస్టిక్ ఇయర్ బడ్స్, బెలూన్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, ఫోర్కులు, చెంచాలు, ట్రేలు, ఆహ్వాన పత్రాలు, 120మైక్రాన్ల లోపు ఉండే ప్లాస్టిక్, పి.వి.సి బ్యానర్లు, ఫ్లెక్సీ బ్యానర్లు పూర్తిగా నిషేదించాలని కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం శతశాతం ప్లాస్టిక్ నిషేదం అమలుకై పట్టణంలో ప్రతి షాపు ముమ్మరంగా తనిఖీ నిర్వహిస్తామన్నారు. నిషేదిత ప్లాస్టిక్ అమ్ముతున్న, వాడుతున్న షాపుల వారికి అపరాధరుసుము విధిస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నియంత్రించాల్సిన అవసరముంద న్నారు. వినియోగ తీవ్రత ఎక్కువైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. వ్యాపారులు, పట్టణ ప్రజలు అందరూ ప్రజారోగ్య దృష్ట్యా, పర్యావరణ పరిరక్షణ కోసం శతశాతం ప్లాస్టిక్ నిషేదాన్ని పాటించి సహకరించాలని కోరారు.

జీడి మామిడి పంటలపై అవగాహన

కురుపాం : జీడి మామిడి వేసినటువంటి రైతులు పురుగు నివారణకు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారిని సిహెచ్ గిరిజ అన్నారు. శనివారం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీలోని గిరిజన రైతులకు పూత, పింజ, పంట దశలో పురుగు మొదలకు, పింజలకు పట్టకుండా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు సస్యరక్షణ చర్యలు గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బి. అన్నాజీ రావు గిరిజన రైతులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు

పాలకొండ రూరల్ : మండలంలోని బుక్కురు సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు శనివారం సందర్శించారు. సిబ్బంది హాజరుతోపాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. టీకే రాజపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు.

ర్యాలీలో మాట్లాడుతున్న సిఐ మురళీధర్

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకొండ : ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సిఐ మురళీధర్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ వద్ద నిర్వహించిన రహదారి భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వాహనదారులంతా తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని, సురక్షిత ప్రయాణం కోసం ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటించాలని, ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని పాటించాలని, మితిమీరిన వేగం ఎంత మాత్రం సురక్షితం కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

వీరఘట్టం : విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఒ పి. కృష్ణమూర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్య ప్రమాణాలు మెరుగుతో పాటు విద్యార్ధులకు రుచికరమైన భోజనం పెట్టేందుకు కూడా దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు అభివృద్ధి పనులపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు, కెపి నాగమణి, డి. నాగమణి, సిహెచ్ రత్నాకర్, భాస్కరరావు, జి. ప్రసాదరావు తదితర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

సీతంపేట : మండలంలోని మర్రిపాడు పంచాయితీ, తోటగూడ గ్రామంలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పై యువతీ యువకులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ పాలక నాగేశ్వరావు మాట్లాడుతూ పురుగు మందులు, రసాయనిక మందులతో పండించే పంటలు వల్ల ఎదుర్కొంటున్న సమస్యలు కోసం వివరించారు. దీని ద్వారా వాతావరణం కాలుష్యం పెరిగి ఆరోగ్యం, ఆర్థికంగా, నష్టం కలుగుతుందన్నారు. చిరు దన్యాలు కొర్రలు, సామాలు, ఊదలు, రాగులు వల్ల ఆరోగ్యం బాగుండి ఆర్థికంగా రైతులు అభివృద్ధి చెందవచ్చునన్నారు. జీడీ పంట పై వచ్చు తెగుళ్ళ గూర్చి వివరించి పువ్వు, పింజ నిలుచుటకు మజ్జిక, కొబ్బరి నీరు స్ప్రేయింగ్ చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు అసోసియేషన్ కార్యదర్శి సంజీవరావు, సిఒ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరీక్షిత్‌రాజు పరామర్శ

కురుపాం : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కురుపాం మేజర్ పంచాయతీ నాయకులు కుప్పిల శకుంతల, మద్ది ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులను శనివారం పార్వతీపురం మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబాలకు ఓదార్చి మనోధైర్యం ఇచ్చి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి. సుజాత, జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, కళింగ వైశ్య జిల్లా అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి సుజాత, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి వి. బంగారనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రం బాగు : టిడిపి

ప్రజాశక్తి- సాలూరురూరల్

ముఖ్యమంత్రిగా బాబు ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుందని సాలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మండలంలోని కూర్మరాజుపేట, పునికిలవలస, మూలవలస తదితర గిరిజన గ్రామాల్లో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సిఎం అయితే రాష్ట్రంలో మంచి పరిపాలన, బడుగు, బలహీన, గిరిజన, హరిజన అన్ని వర్గాల వారికి వివిధ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సైకో ముఖ్యమంత్రి వల్ల రైతు పండించిన ధాన్యం కూడా సక్రమంగా కొనుగోలు చేయటం లేదని విమర్శించారు. క్వింటాకు పది కేజీల వరకు మిల్లర్లు దోచుకుంటున్నారని, బిల్లులు కూడా సమయానికి రావడం లేదని పలువురు గిరిజన రైతులు సంధ్యారాణి వద్ద వాపోయారు. మళ్లీ ఈ రాష్ట్రాన్ని సక్రమంగా సుపరిపాలన విధంగా పరిపాలన సాగించాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు 2024లో ఎన్నుకోబడితేనే అందరికీ అన్ని వర్గాల వారికి లాభం చేకూరుతుందని ఈ రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సాలూరు, మక్కువ మండలాల అధ్యక్షులు ఆముదాల పరమేష్, గుల్ల వేణు, కూర్మరాజుపేట సర్పంచ్ ఆముదాల నలిని, దేవకోటి వెంకటనాయుడు, శ్యాంసుందర్, అక్యాన తిరుపతి, కసినిబోయిన వెంకటరమణదొర, లక్ష్మణ, భాస్కరరావు, కృష్ణ, గోపీ తదితర నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు ట్యాంకుకు మరమ్మతులు

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని డికెపట్నం గ్రామానికి తాగునీరందించే మంచినీటి ట్యాంకు పైపులు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో గత మూడురోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం ఎంపిడిఒ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ జెఇ బసవరాజును అప్రమత్తం చేయడంతో శనివారం గ్రామంలోని ట్యాంకు సంబంధించిన పైపులు, మోటారుకు మరమ్మతు పనులు నిర్వహించడంతో తాగునీటి పునరుద్ధరణ జరిగింది. కార్యక్రమంలో కార్యదర్శి బాషా, సర్పంచ్ దిబ్బన్న, బోర్‌మెకానిక్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వీరఘట్టం : మండలంలోని వండవ గ్రామానికి సమీపంలోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాసురాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పాలకొండ మండలం రామబద్రరాజుపేట గ్రామానికి చెందిన వాసురాజు శనివారం ద్విచక్ర వాహనంపై వీరఘట్టం వచ్చి ఇక్కడ పనులు ముగించుకుని తిరుగు ప్రయాణమై స్వగ్రామానికి వెళుతుండగా వండవ గ్రామ సమీపంలో పాలకొండ నుండి వస్తున్న వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనానికి సమాచారం అందించడంతో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స అందించి వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే వి కళావతి అన్నారు. మండలంలోని దోనుబాయి గ్రామ సచివాలయ పరిధిలో "గడప గడప - మన ప్రభుత్వం" కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి గడప గడపకు ప్రజల వద్దకు వెళ్లి, సంక్షేమ పథకాలు వస్తున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ లేకుండా, మధ్యవర్తి లేకుండా, లంచాలు లేకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవారికి సంక్షేమ పథకాలును అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపిపి బిడ్డక ఆదినారాయణ, ఎంపిడిఒ కె.గీతాంజలి, పాలకొండ ఎఎంసి చైర్మన్ హిమరక మోహన్‌రావు, జెడ్‌పిటిసి సభ్యులు సవర లక్ష్మి, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు సవర లక్ష్మి, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, స్థానిక సర్పంచ్ కూరంగి వెంకినాయుడు, ఎంపిటిసిసభ్యులు జి.కోటేశ్వరరావు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వీరఘట్టం: ఎమ్మెల్యేకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యేకు స్వల్ప అస్వస్థత

మండలంలోని దోనుభాయిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వి. కళావతి అస్వస్థకు గురయ్యారు. అప్పటికే ఆమె జ్వరంతో బాధపడుతుండటంతో ఒక్కసారిగా కుప్పకూలారు. సమీపంలో ఉన్న దోనుబాయి పిహెచ్‌సికి తరలించగా వైద్యాధికారి భానుప్రతాప్ వైద్య సేవలు అందించారు. కొద్దిసేపటికి కోలుకున్న తర్వాత కార్యకర్తలు ఆమెను పరామర్శించారు.

సీతానగరం : మండలంలోని పెదభోగిలి గ్రామ పంచాయతీ, మెట్టి వీధి, గూడెం వీధి కాలనీల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత బజారు వీధి మీదుగా గూడెం వీధుల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను వారికి అందజేశారు. ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలన్నీ సవ్యంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందలేకుంటే వాటి వివరాలను అడిగి సచివాలయం ఉద్యోగులచే అక్కడికి అక్కడే నమోదు చేయించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మామిడి బాబ్జీ, వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బలగ శ్రీరాములు నాయుడు, వైసిపి సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, టి వెంకట అప్పల నాయుడు, ఆర్వీ, ఎన్ రామకృష్ణ, కె.రత్నాకర్, మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణంనాయుడు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్‌ఒ

ఆశ్రమ పాఠశాల సందర్శన

కురుపాం: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత విద్యార్థులకు అవసరమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, వండిన వంటలు, డార్మెంటరీ రూములను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ డి.భాస్కర్ రావు, రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి పి.శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామగోవింద్, వసతి గృహ సంరక్షణ అధికారి కె.సూర్యనా రాయణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గత రెండేళ్లుగా నష్టపోయిన జీడిపంట సాగు చేసే గిరిజన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎపి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఈతమానువలసలో గల జీడిపంటను పరిశీలించి, అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత రెండు, మూడు ఏళ్లుగా జీడి పంట దిగుబడి తగ్గి గిరిజనులకు ప్రధాన జీవనాధారమైన జీడి పంట దెబ్బతినడంతో ఆదాయాల తగ్గిపోయి, జీవనం కష్టంగా మారిందన్నారు. ఆ రోజుల్లో జీడిపిక్క- బతుకు పక్కా అని ధైర్యంగా జీడి పంట వేసుకొని బతికిన గిరిజనులు నేడు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది జీడిపంట పూర్తిగా దెబ్బతిందని, పరిహారం కోసం పార్వతీపురం ఐటిడిఎ వద్ద పలుమార్లు ఆందోళనలు చేయగా, పంట నష్టపరిహారం గుర్తించి ఆదుకుంటామని హామీ ఇచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో సుమారు 50 వేల ఎకరాలు జీడి పంట సాగు చేస్తున్న గిరిజనుల బతుకులు దుర్భరమయ్యాయని అన్నారు. గత మూడేళ్లుగా జీడి పంట దిగుబడి తగ్గిపోవడంతో పాటు చీడ, పీడ, తెగుళ్ల బారినపడి జీడి మొక్కలు పూర్తిగా దెబ్బతింటున్నాయని అన్నారు. తెగుళ్ల కారణంగా నష్టపోయిన గిరిజనులను ఆదుకోవడంపై ఎటువంటి అవగాహన కలిగించడం లేదని అన్నారు. ఈ పంటల్లో మొట్టమొదట ఉలవలు, చోడి, గంటి, జొన్న, సాములు, కొర్రలు, కందులు వంటి పోషక విలువలు కలిగిన పంటలు పండించి జీవించేవారమని, ఐటిడిఎ సహకారంతో అందరూ జీడి పంట వేయడం ఈ రకమైన పంటలను కూడా లేకుండా తినడానికి కూడా కష్టంగా మారిందని అన్నారు. చిరకాల పంటలైనా కొండ చీపుర్లు, కరక్కాయలు, ఇండిపిక్కలు, చింతపండు వంటి అటవీ ఉత్పత్తులు సీతాఫలాలతో పాటు పండించి బతికిన గిరిజనులు జీవనాధారం కోల్పోయారని అన్నారు.

ప్రజల చెంతకే వైద్యం

కొమరాడ : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సరైన వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన కుటుంబ వైద్యుడు విధానంతో ప్రజల చెంతకు వైద్యం చేరుతుందని కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గుమ్మడ గ్రామంలో కుటుంబ వైద్యులు విధానంలో భాగంగా ఇంటింటికి వెళ్లి వైద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గ్రామంలో ఉన్న పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు వైద్య తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి ఈసీజీ తదితర రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏ చిన్న అనారోగ్యం వచ్చిన తక్షణమే ఆసుపత్రికి వచ్చి ప్రజలు వైద్య తనిఖీలు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుతం వైరల్ ఫీవర్స్ ప్రబలుతున్నాయని ప్రతి ఒక్కరూ కాల్చి ఒడబోసిన నీటినే తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధం అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎఎస్‌పితో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఈ నెల 23,24,25 తేదీల్లో జరగనున్న శంబర జాతరలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని జనసేన నాయకులు ఎఎస్‌పి డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్‌ను కోరారు. ఈ మేరకు శనివారం జనసేన జిల్లా నాయకులు ఎఎస్‌పిని కలిసి శంబర జాతరతో పాటు జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంబర జాతరలో నాటు సారాతో పాటు ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా అమ్మకాలు చేస్తే బెల్ట్ షాపుల ద్వారా ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా అమ్మకాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీనివల్ల మందుబాబులు, ఆకతాయిలు మద్యం సేవించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని, కావున శంబర జాతరకు వచ్చే వేలాదిమంది మహిళలు, యువతులపై ఎటువంటి అఘాయిత్యాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా సంపూర్ణం మద్య నిషేధం అమలు చేయాలని కోరారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఇప్పటికే కొంతమంది అనధికారికంగా నాటు సారాతో పాటు ప్రభుత్వ మద్యాన్ని నిల్వ చేసే అవకాశం ఉందని, వాటిపై దాడులు నిర్వహించాలన్నారు. అలాగే సంక్రాంతి రోజుల్లో పార్వతీపురం పట్టణంలోని ఫ్లైఓవర్ పై రోడ్డు ప్రమాదాలు జరిగాయని, రానున్న రోజుల్లో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ నాటుసారా నిషేధంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎఎస్‌పిని కలిసి వారిలో జనసేన నాయకులు వి.దాలినాయుడు, రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీ శంకర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి కొమరాడ

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శనివారం కొమరాడ సబ్ స్టేషన్ వద్ద సిపిఎం పార్టీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నిరసన అనంతరం విధులు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ మిర్యాల శ్రీనివాసరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, గిరిజన సంఘం నాయకులు సాంబమూర్తి, ప్రసాద్, సంగమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణ బిల్లులో భాగంగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి 2023-24 సంవత్సర లోటుగా చూపబడిన రూ.13వేల కోట్లు ప్రభుత్వమే సబ్సిడీగా చెల్లించాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించరాదని ఈ లాంటి సందర్భంలో ఇళ్ళకు, వ్యాపార సంస్థలకు సంబంధించి ప్రీపెయిడ్ మీటర్ల ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూ ఆఫ్ చార్జీలు విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, గిరిజన దళిత కుటుంబాలకు సంబంధించి గత తెలుగుదేశం ప్రభుత్వం మాదిరిగా ఇస్తున్న రాయితీ సంపూర్ణంగా కొనసాగించాలని కోరారు. ఇప్పటికైనా ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేష్, వెంకట్రావు, రామారావు, లక్ష్మమ్మ, పార్వతి, చిలకమ్మ, గౌరమ్మ, పార్వతి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్కును సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి- సీతంపేట

స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్క్‌ను శనివారం పాలకొండ డిఎస్‌పి జివి. కృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. పార్కు ప్రాముఖ్యత గురించి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ఆయనతో పాటు సీతంపేట ఎస్ఐ ఎ. నీలకంఠరావు తదితరులు ఉన్నారు.

అధిక దిగుబడులకే పొలంబడి

ప్రజాశక్తి -పాచిపెంట

పొలంబడిలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఆరోగ్యవంతమైన పంట పండిస్తూ ఖర్చులను తగ్గించుకుని పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా అధిక దిగుబడులు పొందడానికి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా డాక్టర్ వైయస్సార్ పొలంబడులు ఏర్పాటు చేశారని వ్యవసాయ సహాయ సంచాలకులు మధుసూదన్ రావు అన్నారు. మండలంలోని మాతుమూరు రైతు భరోసా కేంద్రం పరిధిలోని తాడూరులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో మొక్కజొన్న పంటపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరిస్తూ రైతులు నిరంతరం పంటల పరిశీలన జరపాలని, మిత్ర, శత్రు పురుగులను గుర్తించగలగాలని సూచించారు. మిత్ర పురుగులు ఎక్కువగా ఉన్నట్లయితే పురుగు మందుల పిచికారి ఆపాలని, పర్యావరణానికి ఎలాంటి హాని జరగకుండా పంటలను పండించేలా రైతులకు సాగులో నూతన సాంకేతిక సలహాలను అందించడానికి తద్వారా పొలంబడిలో పాల్గొన్న రైతులను ఆ పంటలకు కావాల్సిన పూర్తి పరిజ్ఞానాన్ని అందించి రైతులను నిష్ణాతులగా చేయడానికి 14 వారాల పాటు పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తారని అన్నారు. గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శనగల సింహాచలం మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం రైతులకు చాలా ఉపయోగకరమైందని, పొలంబడి రైతులు మాత్రమే కాకుండా గ్రామ రైతులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిన ఆవశ్యకత చాలా ఉందన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. గ్రామ పెద్ద డి.రాము మాట్లాడుతూ గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా ఆనందదాయకమన్నారు. గతవారం ఎపి సిఎంఎఫ్ సిఆర్పి బాలకృష్ణ, విఎఎ దినేష్‌ల ద్వారా విత్తన శుద్ధి మొలక శాతం పరీక్షలు, ట్రైకోడెర్మా వాడే విధానాలను వివరించారు. అలాగే మొక్కజొన్న పంటలో వివిధ జీవ నియంత్రకాలను పిచికారి చేశారని తెలిపారు. ఎఒ కె.తిరుపతిరావు మాట్లాడుతూ రైతులు ఎరువులు వాడే ముందుగా పంటలకు ఆ ఎరువులు ఏ విధంగా ఉపయోగపడతాయో తెలుసుకుంటే ఎరువులను ఎప్పుడు వాడాలో తెలుస్తుందని, లేకుంటే విచక్షణారహితంగా ఎరువులు వాడడం వల్ల భూమిలో సమతుల్యత దెబ్బతిని జీవ వైవిధ్యం నశించి భూముల నిస్సారంగా మారుతాయని అన్నారు. వీటన్నింటి గురించి తెలియజేయడం కోసమే డాక్టర్ వైయస్సార్ పొలంబడులు ఏర్పాటు చేశారని, రైతులు వీటి ద్వారా సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రహించి అనుసరిస్తే ఆరోగ్యవంతమైన పంటను పండించడం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

బలిజిపేట: దుస్తులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

బలిజిపేట : పెదపెంకి గ్రామంలో జమ్మలప్పుడు తల్లి నారాయణమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా నేతాజీ గ్రంధాలయం స్థాపకులు ఈర్ల సంజీవ్ నాయుడు ఆధ్వర్యంలో 25 మంది నిరు పేదలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల శ్రావణ్, కోట చందు, ఈర్ల పవన్, రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ధర్మ కర్త పెంకి బలరాం నాయుడు, జమ్మలప్పుడు స్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో శనివారం బిపి నాయుడు, రాజ్యలక్ష్మి, బివిఎ నాయుడు, ఆశాలతలు నిరుపేదలకు బట్టలు పంపిణీ చేశారు. శిరిడి సాయిబాబా ఆలయ 24వ ప్రతిష్ట లో భాగంగా అన్నం దానంతో పాటు వస్త్రదానం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముదిలి బాబురావు, వి. కృష్ణ, బి సత్యనారాయణ, అప్పలనాయుడు, రామ్మూర్తి వాన కైలాస్, ఎం. పుండరీకం తదితరులు పాల్గొన్నారు.

పనులు చేయించండి : ఎస్ఇ

ప్రజాశక్తి - కురుపాం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సచివాలయానికి మంజూరైన నిధులు సిద్ధంగా ఉన్నాయని, పనులు చేయించే బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లదేనని పంచాయతీరాజ్ ఎస్ఇ ఎంవిఆర్ కృష్ణాజీ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు గడపగడపకు మన ప్రభుత్వం నిధులు, పనుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్యం జిల్లా 15 మండలాలకు సంబంధించి 789 పనులకు గానూ రూ.18 కోట్ల 71లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో పంచాయతీరాజ్‌కు 6.90 కోట్లు, ఆర్‌డబ్ల్యుఎస్‌కు రూ.6.90కోట్లు మంజూరై సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కావున పనులు చేయించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, ఎఇలు ఆర్.వేణుగోపాల్, ఎం.ప్రవీణ్ కుమార్, పిఆర్ ఎఇ నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

సీతానగరం : మండలంలోని జోగింపేట గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బి.కృష్ణ మహేశ్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలో వివిధ గోడపత్రికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని, సచివాలయానికి వచ్చే సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించేలా సిబ్బంది చూడాలని అన్నారు. ఈ పరిశీలనలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, శ్రీనివాస్, పైడ్రాజు, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

11 మందిపై కేసులు

వీరఘట్టం : వీరఘట్టం మండలం ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి స్వగ్రామంలో కొంతమంది వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి గ్రామంలో ఉన్న ఫ్లెక్సీలను చింపారని ఎమ్మెల్యే వీ కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 11 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం హరికృష్ణ శనివారం తెలిపారు. వారిని విచారించి తదుపరిచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

25న వాహనాలకు వేలం

కురుపాం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాలతో పట్టుబడి స్వాధీనపర్చుకున్న ఏడు ద్విచక్ర వాహనాలు, ఒక ట్రాక్టర్ (ఇంజిన్ మరియు తొట్టె)ను ఈ నెల 25న స్థానిక పోలీసు స్టేషన్ వద్ద ఎస్ఇబి సూపరింటెండెంట్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో వేలం వేస్తున్నట్లు ఎస్సై సి హెచ్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొలని ఆసక్తి గల వారు వివరాల కోసం పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని సూచించారు.

గ్రానైట్ పరిశీలన

సీతంపేట : మండలంలోని సామరెల్లి పంచాయతీ రాయకురిడిలో గ్రానైట్‌ను ఐటిడిఎ పిఒ బి.నవ్య శనివారం పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గ్రానైట్‌ను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ గ్రానైట్‌కు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించారు. గ్రానైట్ వల్ల ఎటువంటి సమస్యలు ఎదురవుతున్నాయన్న విషయాలపై గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహమూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు వైద్య పరీక్షలు తప్పనిసరి

పార్వతీపురం టౌన్ : వాహనాల డ్రైవర్లు తమ విధి నిర్వహణకు ఆరోగ్య తనిఖీలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జునరెడ్డి అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా, శనివారం రవాణా కార్యాలయం ప్రాంగణంలో లారీ, బస్సు, ఆటో, వ్యాన్ డ్రైవర్లకు బిపి, షుగర్, కంటి వైద్య పరీక్షలు ప్రభుత్వ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు కార్మికులు ఎంతో వ్యయ ప్రయాసాలతో ప్రయాణికులను వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నారని, మీ ఆరోగ్యాన్ని కూడా పరీక్షించుకునే బాధ్యత మీకు ఉందని అన్నారు. రహదారి భద్రత కూడా మీ చేతుల్లోనే ఉందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శశి కుమార్ తో పాటు రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా రవాణాధికారి మల్లికార్జునరెడ్డి

దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

బాధితులకు దుస్తులు పంపిణీ

సీతానగరం : స్థానిక గూడెం వేదిక చెందిన అగ్ని ప్రమాదబాధితులకు పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు శనివారం బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, సర్వం కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందజేయాలని, తక్షణమే పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పెదబోగిలి గ్రామ సర్పంచ్ జె తేరేజమ్మ, గరికయ్య, టిడిపి మండల అధ్యక్షులు కొల్లి తిరుపతి రావు, మండల పార్టీ నాయకులు ఎస్.హరిగోపాల రావు, బి.శ్రీనివాసరావు, సింతాడు సత్యం, క్లస్టర్ నాయకులు బొమ్మనేని లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నిర్మాణాల పరిశీలన

పార్వతీపురంరూరల్ : మండలంలోని పుట్టూరులో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను శనివారం ఎంపిడిఒ అకిబ్‌జావేద్ పరిశీలించారు. నిర్మాణదారులతో మాట్లాడి వారి సాదకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపులు చేపట్టాలని హౌసింగ్ జెఇ చిరంజీవులను ఆదేశించారు. అనంతరం ఎంపియూపి స్కూల్‌లో అమలువుతున్న జగనన్న గోరుముద్ద అమలును పరిశీలించారు.

జమ్మాన అభినందన

రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, దాసరి కార్పొరేషన్ చైర్మన్‌గా రంఘుముద్రి రమాదేవికి ఎపి టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ శనివారం అభినందనలు తెలిపారు. ప్రభుత్వం కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవీకాలాన్ని మరో రెండేళ్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్న సందర్భంగా జమ్మాన వారిని అభినందించారు.